మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

సీఐ శంకర్రావు, ఎస్ఐ నారాయణరావు

విశాలాంధ్ర - గుర్ల : విద్యార్థులు మాదక ద్రవ్యాలుకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిఐ శంకర్రావు, ఎస్సై నారాయణరావు సూచించారు. మండలంలోని తెట్టింగి హైస్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలుకు, ట్రాఫిక్ రూల్స్, పోక్స్ కేసులుపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. బాలికలపై దాడులు చేసిన. అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. చట్టాలపై అవగాహన చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ పక్కా ఇల్లు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇల్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదల కోసం 100% డిమాండ్ సర్వే జరుగుతోందనీ తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు మాత్రమే గడువు ఉందని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే 5 సంవత్స రాలలో ఎవరికైనా పక్కా ఇల్లు కావాలంటే, ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అర్హతల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎవరు నమోదు చేసుకోవచ్చు

గృహం లేని మరియు స్థలం లేని కుటుంబీకులు. తెల్ల రేషన్ కార్డు ఉండాలి. ఇంతకు ముందు ఏ ఇతర ప్రభుత్వ పథకంలోనూ లబ్ధి పొంది ఉండకూడదు. సొంత స్థలం ఉన్నా లేకపోయినా నమోదు చేసుకోవచ్చు. స్థలం లేని వారికి, తర్వాత స్థలం మంజూరు అయిన తర్వాత పక్కా ఇల్లు మంజూరు చేయబడుతుంది.

నమోదు చేసుకునే విధానం

మీ వివరాలను 'ఆవాస్ ప్లస్ యాప్' (Awaas Plus App) ద్వారా నమోదు చేయించుకోవాలి. మీరు నివసించే సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్. లేదా మండల హౌసింగ్ సహాయక ఇంజనీరుని సంప్రదించండి. లబ్ధిదారులు తమ ఇంటి దగ్గరే ఉండి, ముఖ ఆధారిత నమోదు (Face Recognition) ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలి.

కావలసిన పత్రాలు

పేరు నమోదు సమయంలో ఈ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి. స్థల ధృవీకరణ పత్రాలు (మీకు స్థలం ఉంటే) ?జాబ్ కార్డు,?ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా (అకౌంట్) వివరములు.

ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఈ గొప్ప అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

సైక్లింగ్ పోటీల్లో తోండ్రంగి విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - గరివిడి : ఈ నెల 21 నుండి 23 తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 సైక్లింగ్ పోటీల్లో తొండ్రంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 8వ తరగతి చదువుతున్న ఆర్.భార్గవి అండర్-14 రోడ్ విభాగంలో రజత పతకం (రెండవ స్థానం) సాధించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున జాతీయ స్థాయిలో పోటీ చేసే అర్హతను పొందింది. రాబోయే జనవరి 13 నుండి 16 వరకు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో ఆమె పాల్గొననుంది.అలాగే 9వ తరగతి విద్యార్థులు డి.అనురాధ, చి.నారాయణరావులు అండర్ - 17 విభాగంలో కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పి.ఇ.టికె. లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, పట్టుదల ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. పాఠశాల హెచ్.ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు విజేతలైన విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ అండర్ 19 పోటీలకు చందలూరు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - లక్కవరపుకోట : మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ అండర్ 19 పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ఓ ప్రకటనలో పాఠశాలలో చదువుతున్న సింగవరపు హేమంత్, వాడబోయిన లాస్య ఇద్దరు విద్యార్థులు గత నెల 27న విజయనగరం విజ్జి స్టేడియంలో ఎంపిక చేయడం జరిగిందని జిల్లా మొత్తం 110 మంది క్రీడాకారులు పాల్గొన్నారు అని తెలిపారు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26, నుంచి 28 వరకు విజయవాడ ఎన్టీఆర్ జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి అండర్ 19 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి విజయం సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - రేగిడి : స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రతగా ఉంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి హేమసుందరరావు అన్నారు. మంగళవారం రేగిడి మండలం లోని పనసలవలస గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలకు తడి, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్లకు అందజేసే విధానంపై ఆగవాహన కల్పించారు. అలాగే నీటి సరఫరాలో క్లోరినేషన్, కాలువలలో పూడికతీత తదితర అంశాలను గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంటి వ్యర్ధాలను ఆరుబయట వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలన్నారు.చెత్త సంపద కేంద్రం లో తయారైన వర్మీకంపోస్ట్ ఎరువును అమ్మకం చేయడం ద్వారా గ్రామ పంచాయితీకి ఆర్థికంగా చేయూత అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడివో వి.జగన్నాధరావు, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ,సర్పంచ్ ప్రతినిది గోవిందరావు, కార్యదర్శి బి రాము, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

రామకృష్ణ నగర్‌లో కాలువలు రోడ్లు వెయ్యాలి : సీపీఎం నగరకార్యదర్శి రెడ్డి శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : 29వ వార్డు పరిధిలో రామకృష్ణ నగర్‌లో సుమారు 135 మంది నివాసం ఉన్నారని వీరికి. రోడ్లు, కాలువలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని. కావున తక్షణమే రోడ్లు, కాలువలు వేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర రావు డిమాండ్ చేశారు. రోడ్లు కాలువల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని 33వ సచివాలయం వద్ద నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఉంటున్న రామకృష్ణ నగర్ లో రోడ్లు కాలువలు లేక ఇక్కడప్రజలంతాఇబ్బందులుపడుతున్నారన్నారు. చెట్లు పెరిగి కరెంటు స్థంబాలుకి తాకి ప్రమాధాలు జరిగే అవకాశం ఉంది కావున వాటిని కొట్టించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయ కులు ఎం. జగదాంబ తదితరులు పాల్గున్నారు.

డాక్టర్ రాజేష్ పరామర్శ

విశాలాంధ్ర - రాజాం : బొమ్మి నాయుడువలస పంచాయతీ పరిధి గొల్లపేట గ్రామానికీ చెందిన ఇప్పిలి లక్ష్మీనారాయణమ్మ ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి వారి కుమారులు ఇప్పిలి సోములు, సంతోష్, రాములను పరామర్శించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్ ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ పార్టీ అధ్యక్షులు లావేటి రాజగోపాల్ నాయుడు, జడ్పీటీసీ బండి నరసింహులు, ఉపాధ్యక్షులు కోనారి అప్పారావు, నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు వాకముళ్ల చిన్నం నాయుడు, ఆర్టిఐ విభాగం అధ్యక్షులు వంజరాపు విజయ్ కుమార్, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షులు డా.బి.నరేంద్ర, ఇప్పిలి సింహాచలం, డోప్ప దాలయ్య, పిల్లల పుణ్యవతి వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలి

విశాలాంధ్ర - విజయనగరం : నగర పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరి పైన ఉందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ మరియు స్వర్ణాంధ్ర కార్పొరేషన్ సంయుక్త నిర్వహణలో చేపడుతున్న 4 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రకాశం చేసిన అనంతరం శిక్షణ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ స్వచ్ఛ విజయనగరం సాధన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాల కార్యక్రమాలను రూపొందిస్తూ అమలు చేస్తుందన్నారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధివిధానాలు, ఈ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు, ప్లాస్టిక్ నిషేధపు అమలు తీరు, తడి చెత్త పొడి చెత్త వర్గీకరించే విధానాలు ఇత్యాది అంశాలపై 4 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ముందుగా మనకు మనం సంస్కరించుకోబడాలని, ఆ తర్వాత ప్రజలను చైతన్యవంతులను చేసి సమాజాన్ని సంస్కార వంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఐ. వెంకటేశ్వరరావు, జిల్లా కో ఆర్డినేటర్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో సోమలింగాపురం సబ్ స్టేషన్ లో 33 కె వి బ్రేకర్ అరేంజ్ మెంట్ పనులు జరగనున్నాయి. గురు వారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విధ్యుత్ అంతరాయం కలుగును. సోమ లింగాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు సోమలింగాపురం, మెరకముడిదాం, ఎం.పాలెం, ఎం. రావివలస, రామయ్య వలస, గాతాడా, పాండ్రంకిపేట, గొల్లలమర్రివలస, గోపన్నవలస, కొండలావేరు, భగీరదిపురం, బాడాం, ఊటపల్లి, శ్యామయవలస, కొమ్మయని వలస, గాదెల మర్రివలస, బద్నాయూని వలస, గ్రామాలకి ఉదయం 8 గంటల నుండి విధ్యుత్ అంతరాయం కలుగును అని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఆపరేషన్ పి. త్రినాద్ తెలిపారు.

జేఎన్టీయూ జీవీలో ఉత్తరాంధ్ర ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం మంగళవారం జరిగింది. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రత్యక్ష ప్రాయోగిక అనుభవం, పరిశ్రమ విద్యా సంస్థల భాగస్వామ్యం బలోపేతం చేయడం, కనీసం రెండు నెలల శిక్షణా కార్యక్రమాలు (ఇంటర్న్‌షిప్‌లు) అమలు చేయడం అవసరమన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్దాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో జరుగుతున్న వేగ వంతమైన మార్పులను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు పాఠ్యాంశాలు, అదనపు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టడం అత్యంత ముఖ్యం అని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగావకాశాలను సులభంగా పొందే విధంగా శిక్షణ కల్పించాలన్నారు.ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ, అర్హత కలిగిన అధ్యాపకులకు పరిశోధన పర్యవేక్షకులుగా సేవలందించే అవకాశాలను కల్పించాలని కోరారు. పి.హెచ్.డి. చేయడానికి పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నందున, దీనిపై విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు."కార్యక్రమం ముగింపులో వైస్ చాన్సలర్ మరియు రిజిస్ట్రార్‌ను ఘనంగా సన్మానించారు.

మాది రైతు పక్షపాతి ప్రభుత్వం

ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్

విశాలాంధ్ర - మెరకముడిదాం : రైతులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తమది రైతు పక్షపాతి ప్రభుత్వం అని ఏఎంసీ చైర్మన్ తాటి చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు సూచనలతో, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఆదేశాల మేరకు గర్భాం గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. గర్భాం గ్రామంలో రైతుల ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొని అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రపంచంలో ఎక్కడైనా అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్నాయంటే..అక్కడ మాన వత్వానికి చెదలు పడుతున్నాయన్న సంకేతాన్ని సూచిస్తుందని సూఫీ అభిషిక్తులు, హజరత్ ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎండీ ఖలీల్ బాబు తన ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వానికి మాతృకగా నిలిచే సూఫీ పరంపర దక్షిణ భారత సూఫీ సామ్రాట్, దైవాంశ సంభూతులు, మహర్షి ఖాదర్ బాబా వారి ప్రియ శిష్యులు హజరత్ ఖ్వాజా మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా (ర.అ.) వారి 89వ జన్మ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సామాజిక సేవకులు, వైద్యులు, బాబా ప్రేమికులైన డాక్టర్ అవసరాల శ్రీధర్, సంతోష్ సోదరులతో కలిసి ఖలీల్ బాబు ఏటికే వెలుగు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. పరిసరాల పిల్లలకు, యువకులకు పండ్లు పంచారు. ఈ సందర్భంగా ఖలీల్ బాబు మాట్లాడుతూ, మనసుల్లో ప్రేమ దూరమైతే, మనుషుల మధ్య బంధాలు దూరమవుతాయని, మనిషి హృదయం మలినమైపోతూ ఉంటే మానవత్వం చచ్చిపోతూ ఉంటుందని అన్నారు. ఎవరైతే తమ హృదయాల్లో ప్రేమను నింపుకుని సత్ కార్యాలు చేస్తారో వారిపై దైవం కరుణ తప్పక ఉంటుందని ఖలీల్ బాబు ఉద్బోధించారు. సాటి మనిషిని ప్రేమిస్తూ, వారి బాధల్లో పాలు పంచుకోవాలని ప్రతీ ఒక్కరినీ కోరుకుంటూ, సూఫీ చంద్ర బింబం ఖాదర్ బాబా వారి దయ, కరుణ, కటాక్షం ప్రతీ ఒక్కరిపై ప్రసురించాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఖలీల్ బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాబా సేవకులు రంగారావు బాబాయ్, సోషల్ సర్వీస్ యూత్ అంబాసిడర్ ఎండీ అహమ్మద్ బాబు, జుజ్జూరు ఖాదర్, నాగూర్, జర్నలిస్ట్ జైరాజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలి

విశాలాంధ్ర - డెంకాడ : ఈ.ఎం.డి.పి (ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డెంకాడలో సెషన్ సమస్య కనుగొనడం మరియు పరిశీలన పై 9వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యలను విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, స్వయంగా కొత్త విషయాలను ఆవిష్కరించే సామర్థ్యం వంటి లక్షణాలను అభివృద్ధి చేయడం. భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యక్తులుగా ఎదగాలని ఈ.ఎం.డి.పి. జిల్లా మేనేజర్ కె.నరేష్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చేసిన కృత్యాలును చూసి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి ఆర్.కృష్ణ విద్యార్థులకు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. సెషన్‌ను ఈ.ఎం.డి.పి ఫెసిలిటేటర్ కె.సుధాకర్ బోధించారు.

అవినీతి ఆరోపణలపై బహిరంగ విచారణ.. హాజరుకాని రైతులు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : భూముల మ్యుటేషన్ చేయడానికి విజయనగరం మండల రెవెన్యూ కార్యాలయంలో లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులుపై విచారణ నిర్వహించేందుకు, అధికారులు వచ్చినా, ఫిర్యాదు దారులు రాలేదు. అయితే ఫిర్యాదు దారులకు విచారణ జరుగుతుందనే సమాచారం ఇవ్వక పోవడం వల్లనే విచారణకు రాలేదని తెలుస్తోంది. అవినీతి ఆరోపణలపై బహిరంగ విచారణ చేపట్టేందుకు పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ మురళి తహశీల్దార్ కార్యాలయంచేరుకున్నారు. తహశీల్దార్ కూడా కార్యాలయంలో వున్నారు. సమయం గడుస్తున్నా ఫిర్యాదు చేసిన రైతులు విచారణకు రాకపోవడంతో అసలు వారికి సమాచారం అందిందా లేదా అని కూడా ఆరా తీశారు. అయినా వేచి చూస్తామని విచారణాధికారి మురళి కార్యాలయంలోనే వున్నారు. విజయనగరం తహశీల్దార్ కార్యాలయంలోమ్యుటేషన్ చేయడానికి, పట్టాదారు పాసు పుస్తకాల జారీకి అధికారులు రూ.లక్ష వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని రాకోడు గ్రామానికి చెందిన రైతులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఈ బహిరంగ విచారణ చేసేందుకు మురళి వచ్చారు.

విద్యార్థులకు స్టేషనరీ సామాన్లు వితరణ

విశాలాంధ్ర - జామి : మండలంలోని భీమసింగిలో పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వైసీపీ నేత పాండ్రంకి నాని తన కుమార్తె పుట్టినరోజుతోపాటు సత్యసాయి పుట్టిన రోజును పురస్కరించుకుని 45మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రిని అందజేసారు. అలాగే గ్రామానికి చెందిన వత్స లక్ష్మి అందరికీ ప్రసాదవితరణ చేపట్టారు. గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈవితరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో మజ్జి హరికృష్ణ, ఆల్తి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడివో ఎస్.అప్పలనాయుడు తెలిపారు. 28న ఉదయం 11గంటలకు స్థానిక సమావేశపు మందిరంలో ఎంపిపి ఎస్.అరుణ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు అందజేయడం జరిగిందన్నారు.

భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక భారతరాజ్యాంగం : డాక్టర్ కృష్ణప్రసాద్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భారతీయుల ఆత్మగౌరవానికి భారత రాజ్యాంగం ప్రతీక అని అత్యంత పవిత్ర మైనదని సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురజాడ పాఠశాలలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడుతూ మన రాజ్యాంగం సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగమని,ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మన దేశందేనని అన్నారు. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్వరూప స్వభా వాన్ని తెలిపే లిఖిత పత్రం రాజ్యాంగం, రాజ్యాంగ మంటే స్వేచ్ఛ, సమానత్వం సోదరభావాలు, మూల స్థంభాలుగా దేశ ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించే సమున్నత ఆశయమని అన్నారు. ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ గోటేటి హిమబిందు, జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ కృష్ణాజీ, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పైలా రమేష్ రాజులు మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించే దృక్పథం మన భారత రాజ్యాంగం కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సుభద్రాదేవి, న్యాయవాది పిబిఎస్ పవిత్ర, పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రిన్సిపాల్ పూడి శేఖర్, రచయిత కాగుపాటి నారాయణమూర్తి పాల్గొన్నారు.

21 మందిపై బైండోవర్ కేసులు

విశాలాంధ్ర - వేపాడ : మండల పరిధిలో మద్యం అక్రమ రవాణా మరియు బెల్ట్ షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఈ సందర్భంగా బెల్ట్ షాపులు నడుపుతూ ఉన్న 17మందిపై, అలాగే నాటు సారాయి నల్ల బెల్లం అమ్మకాల కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న మరో నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సై వి.ఎన్.రాజు తెలిపారు. మంగళవారం తహసిల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 21మందిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇకపై ఈ కేసుల్లో ఉన్నవారు మళ్లీ ఇటువంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే ఒక్కొక్కరిపై రూ.2 లక్షల వరకు అపరాధ రుసుం విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. తరువాత ఎక్సైజ్ సిబ్బందితో కలిసి మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మద్యం సీసాలను స్కాన్ చేయకుండా అమ్మడం, ఎంఆర్పీకి మించి ధరలు వసూలు చేయడం, కల్తీ మద్యం విక్రయం, అలాగే బెల్ట్ షాపులకు మద్యం సరఫరా వంటి ఉల్లంఘనలపై దుకాణ సిబ్బందికి నోటీసులు జారీ చేశారు.నిబంధనలు అతిక్రమించిన వారిపై నిర్బంధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పి.వీర్రాజు, బి.హరి కిరణ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర - జామి : మండల కేంద్రమైన జామిలోని ప్రధాన రహదారిలో ఎఎస్ఐ వి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళ వారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ వీరజనార్ధన్ సూచనల మేరకు ఈవాహన తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా డ్రంకన్ డ్రైవ్, వాహనాలకు ధృవీకరణ పత్రాలు, అలాగే గతంలో వున్న చలానాల వసూళ్ళపై పరిశీలన చేసినట్లుగా తెలిపారు. హెల్మెట్‌లు లేకుండా వస్తున్న వాహనదారులకు హెచ్చరికలు చేసారు.

మానవత్వపు ముద్ర వేసిన మాతృభూమి సేవా సంఘం

గుడివాడలో నిరుపేద కన్యాచారి కుటుంబానికి నెలరోజుల నిత్యావసర సరుకుల సాయం

విశాలాంధ్ర - వేపాడ : నేటి సమాజంలో మనుషుల మధ్య విలువలు తగ్గిపోతున్న తరుణంలో మాన వత్వం జాలువారే సేవా కార్యక్రమాలు మరింత ప్రేరణనిస్తూ ప్రజలలో నమ్మకం పెంచుతున్నాయి. అలాంటి సేవాభా వాన్ని ప్రతిబింబిస్తూ మాతృభూమి సేవా సంఘం మరోసారి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన కన్యాచారి కుటుంబం ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో జీవనోపాధి కోల్పోయిన విషయం గ్రామీణ వైద్యులు రామారావు,కిషోర్ దృష్టికి వచ్చింది. వెంటనే వారు ఈ విషయాన్ని మాతృభూమి సేవా సంఘం దాతలకు తెలియజేశారు. సమాచారం అందుకున్న సంఘం దాతలు చురుకుగా స్పందించి, ఆ కుటుంబానికి నెలరోజులకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో సంఘం ఎస్.కోట నియోజకవర్గ ఇంచార్జ్ కొల్లి సురేంద్ర, అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఇటువంటి మానవతా కార్యక్రమాలలో ముందుండే దాతలందరికీ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అన్నగా, ఆకలితో ఉన్నవారికి అమ్మగా నిలిచే సంస్థగా మాతృభూమి సేవా సంఘం సేవలను అన్ని ప్రాంతాలకు విస్తరించడం మా లక్ష్యం అని పేర్కొన్నారు. సంఘం చూపిన ఈ మానవతా సేవ గ్రామ ప్రజల్లో ప్రశంసలు పొందింది. మానవత్వం పరిరక్షణలో మాతృభూమి సేవా సంఘం అడుగులు మరోసారి అందరి మనసులు గెలుచుకున్నాయి.

బీఎల్ఏలను నియమించండి : జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

విశాలాంధ్ర - విజయనగరం : రాజకీయ పార్టీలు ప్రతీ పోలింగ్ బూత్‌కు తమ ప్రతినిధిగా ఒక ఏజెంట్‌ను (బిఎల్ఏ) నియమించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు. తమ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి, వారినుంచి పలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గతంలో అదేవార్డుకు చెందిన వ్యక్తిని మాత్రమే బిఎల్ఏగా నియమించే అవకాశం ఉండేదని, తాజాగా దానిని ఎన్నికల కమిషన్ సవరించిందని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని వ్యక్తులను అదే నియోజకవర్గంలో ఎక్కడైనా బిఎల్ఏగా నియమించుకొనే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందని డిఆర్ఓ తెలిపారు. బిఎల్ఏను నియమించడం ద్వారా ఒక వ్యవస్థీకృత యంత్రాంగం ఏర్పాటవుతుందని సూచించారు. అలాగే ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు దోహద పడుతుందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 15,72,464 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఎప్పుడైనా ధరఖాస్తు చేయవచ్చునని సూచించారు. నిర్ధిత సమయంలో వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. తమ ధరఖాస్తు స్థితిని ఏ పౌరుడైనా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1847 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా మరో 122 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని డిఆర్ఓ వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ భాస్కరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి కుటుంబరావు, వైకాపా నుంచి శ్రీనివాసరెడ్డి, బిజెపి నుంచి అప్పారావు, కాంగ్రెస్ నుంచి శ్రీనివాసరావు, సిపిఎం నుంచి టి.సూర్యనారాయణ, బిఎస్‌పి నుంచి సోములు, ఆప్ నుంచి పైలా రమేష్‌రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
బుధవారం 26, నవంబరు 2025

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం సమయంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య విధానాన్ని గమనించారు. పలువురికి సూచనలు చేశారు. అనంతరం అన్న క్యాంటీన్ ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలు మరియు పారిశుధ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే 37, 38

సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది కార్యదర్శులను మందలించారు. ఇటువంటివి పునరావృతమైతే విధుల నుంచి తొలగించి వస్తామని స్పష్టం చేశారు.

మత్తు పదార్ధాల నిర్మూలనే మనందరి "సంకల్పం"

బిసి ఐ దుర్గా ప్రసాద్

విశాలాంధ్ర-భోగాపురం: మత్తు పదార్థాలు వాడటం వల్ల దన మాన ప్రాణాలు కోల్పోయి భవిషత్ అందకారమౌతుందని సీఐ దుర్గాప్రసాద్ యువత కు అవహగానా కల్పించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలన పై చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం భోగాపురం గ్రామానికి చేరుకున్న సందర్భంగా వారికి ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పాఠశాల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు తో సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మద్యపానం, గంజాయి, ధూమపానం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ నివారణకు డిఐజి గోపినాథ్ జెట్టి, ఎస్పీ దామోదర్ యువతకు విస్తృతంగా అవగాహనా కల్పిస్తున్నారని కొనియాడారు. మత్తు పదార్థాల నియంత్రణ కేవలం ప్రజల భాగస్వామ్యంతోమాత్రమే సాధ్యమవుతుందని, అందుకు ప్రజలు

సహకరించాలన్నారు.మత్తు పదార్థాలు విక్రయించినా , రవాణా చేసినా, వినియోగించినా వెంటనే పోలీసులకు గాని 1972 నెంబర్ కు గాని పిర్యాదు చేయాలనీ సూచించారు. మత్తు పదార్థాలు లేని సమాజం కోసం అందరు కృషి చేయాలనీ పిలుపు నిచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలనే మనందరి " సంకల్పం" కావాలన్నారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర లో పాల్గొన్న 25 సభ్యులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పాపారావు,విద్యాశాఖాధికారి చంద్ర మౌళి, ఉన్నత పాఠశాల, సాయి నారాయణ విద్యార్థిని విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

లింగ సమానత్వమే లక్ష్యంగా నూతన చైతన్యం 4.0 ప్రారంభం

విశాలాంధ్ర -విజయనగరం: లింగ సమానత్వమే లక్ష్యంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతన చైతన్యం (నయీ చేతన్) 4.0 కార్యక్రమం ప్రారంభమయ్యింది. సుమారు నెల రోజులపాటు జరిగే ఈ ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్, మంగళవారం ఢిల్లీలో వర్చువల్ గా ప్రారంభించారు. డే ఎన్ఆర్ఎల్ఎం ద్వారా స్వయం సహాయక సంఘాలు, ఇతర ప్రభుత్వం విభాగాలు, వివిధ పౌర సమాజ సంస్థలు (సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్) అనుసంధానంతో ఈ "నయీ చేతన 4.0 - మార్పు కోసం ముందడుగు" కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వివిధ రాష్ట్రాలలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం నిర్వహించడం దీని లక్ష్యం. నూతన చైతన్యం 4.0 -మార్పు కోసం ముందడుగు: వికసిత గ్రామీణ భారత దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలే ముందుండాలి. అన్న నినాదంతో ఈ ఏడాది విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టనున్నారు. జెండర్ ఆధారిత హింస పైనే కాకుండా, హింస, వివక్ష మరియు మహిళల ఆర్థిక సాధికారత మధ్య ఉన్న లోతైన సంబంధాల పై దృష్టి సారించనున్నారు. జిల్లా నుంచి ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ పాణి, ఏపిడి కె. సావిత్రి, ఏపిడి డి. రత్నాకర్, డి.పి.ఎం లు, ఎ.పి.ఎం. లతో బాటు, జిల్లా సమాఖ్య

అధ్యక్షురాలు సి. హెచ్. మాధవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రచార ర్యాలీని నిర్వహించారు. **ప్రచార కార్యక్రమాల షెడ్యూల్ :** మొదటి వారం తేదీ 25.11.2025 నుండి 01.12.2025 వరకుఆర్థిక సహకారులుగా మహిళల పాత్ర పట్ల సమాజంలో పెరిగిన అవగాహన మరియు దృక్పథాలలో మార్పు.2వ వారంతేదీ 02.12.2025 నుండి08.12.2025 వరకుమహిళలకు పురుషులకు సమానముగా వనరుల అందుబాటులోకి తేవటం సమాన అవకాశాలు కల్పించటం.3వ వారంతేదీ 09.12.2025 నుండి 15.12.2025 వరకుమహిళలు మరియు బాలికలు మరింత భద్రంగా మరియు స్వేచ్ఛగా ప్రయాణించే పరిస్థితులు కల్పించటం. 4వ వారం తేదీ 16.12.2025 నుండి 23.12.2025 వరకుమహిళలు చేస్తున్న చెల్లింపు లేని సంరక్షణ మరియు గృహ పనుల చుట్టూ ఉన్న సామాజిక నియమాలను సవాలు చేసి మహిళల పనిభారం తగ్గించడం.

పి ఎ. సి. ఎస్ చైర్మన్ గా మరోత రామారావు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: లక్కవరపుకోట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకు చైర్మన్ గ మండలంలోని ఎల్కోట తలారి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మరోత రామారావును ప్రభుత్వము ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే డైరెక్టర్లుగా గండి శ్రీరామ్ మూర్తి, శ్రీరామ్ రెడ్డి రామ్ కుమార్ ఎంపికైనారని ఆమె తెలిపారు. చైర్మన్, డైరెక్టర్లకు ఎమ్మెల్యే లలిత కుమారి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, సహకార పరపతి సంఘాన్ని బలోపేతం చేసి రైతులకు అండగా నిలవాలి అన్నారు. రైతులకు ఎరువులు, రుణాలు, విత్తనాలు సకాలంలో అందజేసే బాధ్యత పిఏసఏస్ పై ఉందన్నారు.

చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ పై శిక్షణ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ పై ఐసిడిఎస్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ సిబ్బందికి ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించబడింది. ఈ శిక్షణలో చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ పై అవగాహన, ఫోక్సో చట్టం,జె. జె. చట్టం, బాల్యంలో జరిగే ట్రామా అనుభవం మరియు ప్రభావం, పిల్లలను నమ్మించి, మోసం చేసి దగ్గరవ్వడం, సి ఎస్ ఏ ను పిల్లలు ఎలా వెల్లడిస్తారు, పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం వంటిపై శిక్షనిచ్చారు. అంతేకాకుండా శాఖల మధ్య సమన్వయం, కమిట్మెంట్లు, శాఖల పాత్ర మరియు నివేదికలు గూర్చి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్ ఉదయ్ కుమార్, ఇన్చార్జ్ ఎంపీడీవో బివి సుదర్శన్ పట్నాయక్, వైద్యాధికారి బి.పూజ, సి హెచ్ ఓ రామారావు, మండల విద్యాశాఖ అధికారులు ఎం చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ, సోషల్ వర్కర్ వై శ్రీనివాస్, ఐసిడిఎస్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ సిబ్బంది, టీం సభ్యులు ఎన్జీవోలు పాల్గొన్నారు.

జేడ్పీ హైస్కూల్ సందర్శనలో ఎంఈఓ

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వ్యాపాడ జిల్లా పరిషత్ హై స్కూల్ ని మంగళవారం మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సమావేశమై వారికి పరీక్షల ప్రాధాన్యం వివరించారు.విద్యార్థులు ప్రతిరోజూ యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని దానికి అనుగుణంగా స్టడీ అవర్స్ వినియోగించుకోవాలని,నూటికి నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని విద్యాశాఖాధికారి సూచించారు. విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, పద్ధతిగా చదువుకోవడం అవసరమని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.వల్లి, సిఆర్ఎంటి కె. రామప్రసాద్ పాల్గొన్నారు.

లింగ వివక్షత పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చీపురుపల్లి: జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా లింగ వివక్ష, హింస, అసమానతలు పై అవగాహన పెంపొందించడం చీపురుపల్లి మండల సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం నాడు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నయీ చేతన 4.0మార్పు కోసం ముందడుగు అనే జెండర్ అసమానతలు తొలగించే జాతీయ ప్రచార కార్యక్రమం లో భాగంగా నాలుగు వారాలపాటు ఈ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఏపిఎం అప్పలనాయుడు వివరించారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 23 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. మండల సమైక్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో డిప్యూటీ ఎంపీడీవో జి అప్పలనాయుడు పాల్గొని మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత చూపు రాదని, ఆర్థిక సాధికారత పెంపుదల చేయుటకు ప్రతి ఒక్కరు కృషిచేర్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య సీసీలు, వి ఓ ఏలు , మహిళా సంఘాల ప్రతినిధులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్సోర్సింగ్ సమస్యలను పరిష్కరించాలి

ఆర్టీసీ జోనల్ చైర్మన్ వినతిపత్రం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ విచ్చేసిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా . అవుట్సోర్సింగ్ స్టేట్ పబ్లిక్ సెక్రెటరీ ఏ అశోక్ మాట్లాడుతూ, ఆర్టీసీ కాంట్రాక్టు 7800 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పని చేస్తున్నాం, థర్డ్ పార్టీ విధానం వల్ల చాలా నష్టపోతున్నాం. ఆర్టీసీలో థర్డ్పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అప్కాస్లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.ఈ సమస్యలను గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తారని కోరారుచైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, కె తిరుపతిరావు, పి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-గుర్ల: గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో వున్న 11కేవీ అచ్యుతాపురం ఫీడర్ పై గల గుజ్జింగవలస, గోషాడ, కెల్ల ,చోడవరం , పెనుబర్తి, చుక్కపేట, గంగిరెడ్లపేట, చింతపల్లిపేట, తెట్టంగి, పోలయ్యవలస, పకీరుకిత్తలి, మిగిలిన అన్ని గ్రామంలకు ,11కేవీ గుర్ల ఫీడరు పై గల గుర్ల గ్రామమునకు ఉదయం10 గంటలు నుండి 12 గంటల వరకు క్రొత్తగా లైన్ వేయుట కొరకు ఆర్డిఎస్ఎస్ పని నిమిత్తము విద్యుత్కు అంతరాయము కలుగును.విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.త్రినాధరావు తెలిపారు

రైతన్న మీకోసం కార్యక్రమం సద్వినియోగించుకోవాలి

గ్రామా-గ్రామానికి చేరుతున్న వ్యవసాయ శాఖ అధికారుల బృందాలు

విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో నవంబర్ 24 నుంచి 29 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ చేపట్టింది. ఆరు రోజుల పాటు ప్రతి గ్రామంలో రైతులను కలుసుకుని, వారి వ్యవసాయ పరిస్థితులు, అవసరాలు, సమస్యలు తెలుసుకునే దిశగా అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు.గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్, పశుసంవర్ధన శాఖ అసిస్టెంట్, గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ మరియు గ్రామ రెవెన్యూ అధికారి కలిసి ఒక సమగ్ర బృందాన్ని ఏర్పాటు చేసి, మొబైల్ యాప్ ద్వారా రైతుల వివరాల సేకరణ చేపట్టారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ రంగంలో కొత్త మార్పులు,ఆధునిక పద్ధతులు, ప్రభుత్వం తీసుకొచ్చిన ఐదు ప్రధాన విధానాలు గురించి అవగాహన కల్పించారు.వీటిలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్పీతో పాటు ప్రకృతి వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ వంటి అంశాలు ప్రాధాన్యంగా

చర్చించారు.రాబోయే రబీ-ఖరీఫ్ సీజన్లకు తగిన కార్యాచరణ ప్రణాళిక గ్రామస్థాయిలో రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.కాగావేపాడ, వీలుపర్తి గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ,ప్రతి రైతు బోరు ఉన్న చోట డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకోవాలి. పంట మార్పిడి పద్ధతులు రైతులకు అధిక లాభాలు అందిస్తాయి.డిమాండ్ ఆధారిత పంటల సాగు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నాణ్యమైన దిగుబడులకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె రాములమ్మ, మండల వ్యవసాయ అధికారిని ఎం. స్వాతి,ఏఇఓ అక్కునాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పర్యటనలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ సోమవారం నిర్వహించారని పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు.కాగా 9,10,11,12 తరగతుల విద్యార్థులు విజయనగరం జిల్లాలోని టెక్స్టైల్స్మరియుక్రాఫ్ట్బజార్నుసందర్శించారన్నారు. ఈ సందర్భంగా వొకేషనల్ విద్యార్థులతో పాటు అప్పారెల్ ట్రైనర్ దేవి పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. విజయనగరం శ్రీ బాలాజీ మార్కెట్లోని టెక్స్టైల్ వ్యాపారవేత్తలను కలిసి పరిశ్రమల పనితీరును విద్యార్థులు సమగ్రంగా తెలుసుకున్నారు.మహావీర్ టెక్స్టైల్స్ అధినేత జైకిషన్ రాగిణి విద్యార్థులతో మాట్లాడుతూ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు, దుస్తుల తయారీ

విధానం,వ్యాపార నిర్వహణ, లాభనష్టాల వంటి అంశాలను విశదీకరించారు. అనంతరం సంకెశ్వర్ టెక్స్టైల్స్కు చెందిన వ్యాపారవేత్త వెంకటేష్ వివిధ రకాల చీరలు,వాటి నేసే ప్రక్రియ, అవి ఏ ప్రాంతాల్లో తయారవుతున్నాయనే వివరాలు విద్యార్థులకు తెలియజేశారు.టెక్స్టైల్ రంగంపై విలువైన సమాచారాన్ని అందించిన వ్యాపారవేత్తలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా విద్యార్థులు వ్యాపార మెలకువలు,పారిశ్రామిక అవగాహన సంపాదించినట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు పేర్కొన్నారు.

నీటి చార్జీలను త్వరితగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలి

విశాలాంధ్ర -విజయనగరం :నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో నీటి చార్జీలను త్వరితగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆయన ఆదేశాలతో ఈ మేరకు సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మంగళవారం నగరంలోని పలు సచివాలయాలు, ఇతర ప్రాంతాలలో పర్యటించి నీటి చార్జీ వసూళ్ళ తీరును గమనించారు. తక్కువగా వసూళ్లు అవుతున్న సచివాలయాలకు వెళ్లి అందుకు గల కారణాల పై ఆరా తీశారు. అలాగే నీళ్ళ ట్యాంకు వద్దకు చేరుకొని అక్కడ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు సకాలంలో సిబ్బంది హాజరవుతున్నారా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి చార్జీ

వసూళ్ళలో విజయనగరం నగరపాలక సంస్థ చాలా వెనుకబడి ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. అందువల్ల టీములుగా ఏర్పడి నీటి చార్జీలను పగడ్బందీగా వసూలు చేయాలన్నారు. మొండి బకాయిదారులకు ముందుగా నోటీసులు జారీ చేసి తదుపరి 10 రోజుల అనంతరం కుళాయి కనెక్షన్లు తొలగించి వేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమకు సహకరించి నీటి చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు.

మాదకద్రవ్యాల నియంత్రణ మనందరి బాధ్యత

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



విశాలాంధ్ర డెంకాడ: మాదకద్రవ్యాల నియంత్రణ మనందరి బాధ్యత అని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు మంగళవారం డెంకాడ మండలం పెద్ద తాడివాడ గ్రామంలో నిర్వహించిన అభ్యుదయ సైకిల్ ర్యాలీని జెండా ఊపిస్వాగతం పలికారు సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల పట్ల యువత విద్యార్థి దశలోని సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసులు ఎప్పుడూ ప్రజలతో ఉండాలని అని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులతోవిభిన్న పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు



ఆరోగ్యకరమైన జీవితం సమాజ సేవే మా ధ్యేయం అని సంకల్పబద్ధులయ్యారు.సమన్వయ సమిష్టి కృషే విజయానికి మూలంపోలీసు శాఖ, స్థానిక నాయకులు, విద్యా సంస్థల ప్రతినిధులు కలిసి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. యువతలో మంచి చైతన్యం కలిగించడంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన సింగర్ రమణ కి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ ఎస్సై సన్యాసినాయుడు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు పల్లె భాస్కరరావు కలిదిండి పాణిరాజు తుమ్మి లక్ష్మి పాల శ్రీను పైలా శంకర్ సింగర్ రమణ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని వీర్ ఉద్యోగాలకు నలుగురు ఎంపిక

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒక్కసారిగా దేశ రక్షణ దళ ఉద్యోగంలో భాగంగా అగ్ని వీర్ సైనిక విభాగానికి ఎన్నిక అయ్యారు. ఈ మేరకు మంగళవారం నాడు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుని ఉమామహేశ్వరి తో పాటు, పాఠశాల ఎన్సిసి అధికారి మామిడి శ్రీనివాసరావు పలువు ఉపాధ్యాయ సిబ్బంది అగ్ని వీర్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. 2023 10వ తరగతి బ్యాచ్కి సంబంధించి రామలింగాపురం గ్రామానికి చెందిన ముడిల పవన్ కుమార్, పురియ వలస గ్రామానికి చెందిన గురాన లోకేష్, మెట్ట కాలనీకి చెందిన డబ్బాడ సాయి కిరణ్, అదే విధముగా 2021 పదవ తరగతి బ్యాచ్కు చెందిన రెడ్డి పేట విద్యార్థి రెడ్డి రవి అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్సిసి వింగ్ విద్యార్థిగా పనిచేసిన వీరు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ లు చిట్టిబాబు మాస్టర్, పాఠశాల సిబ్బంది తదితరులు ప్రశంసించారు.

త్రిబుల్ రైడింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తాం

డి.ఎస్.పి భవ్య రెడ్డి

విశాలాంధ్ర-రామభద్రపురం: ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని బొబ్బిలి డిఎస్పి భవ్య రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకురోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భవ్య రెడ్డి మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి వాహనదారుడు నెమ్మదిగా వెళ్లాలని కోరారు వాహనం నడిపేటప్పుడు సెల్ఫోన్ చెవి దగ్గర పెట్టుకొని చాలామంది డ్రైవ్ చేస్తున్నారని, ఎదురుగా వచ్చే వాహనాన్ని గమనించకపోవ డం తో ప్రమాదాల జరుగుతున్నాయని అన్నారు. వాహనం నడిపేటప్పుడు ముందు వెనుక చూసుకుని నడపాలని అన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు శిరశాస్త్రణం పెట్టుకోవాలని కోరారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల కఠినమైన చట్టాలు తీసుకువచ్చాయని, కావున ఈ విషయాన్ని వాహనదారులందరూ దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలని అన్నారు. మద్యం సేవించి నడిపితే జరీ మాన జైలు శిక్ష న్యాయమూర్తులు విధిస్తున్నారని అన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కచ్చితంగా ఉండాలని అప్పుడే వాహనదారులకు, ప్రమాదగ్రస్తులకు తగిన భద్రత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు, ఎస్సై వెలమల ప్రసాదు, ఏఎస్ఐ అప్పారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండంపేట సమస్యలపై గ్రామస్తులు తో కమిషనర్ సమీక్ష

మున్సిపాలిటీ అభివృద్ధికి టాక్స్ సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపల్ కమిషనర్ ఈరోజు ఉదయం 9 గంటలకు కొండంపేట వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని శానిటేషన్ పరిస్థితులు,చెత్తసేకరణ, తాగునీటి సరఫరాపై కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్యలు, లోపాలను సంబంధిత సిబ్బందికి వెంటనే సూచిస్తూ శుభ్రతపై మరింత శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.తరువాత కొండంపేట సెంటర్లో వార్డు సభను నిర్వహించిన కమిషనర్ వాటర్ ట్యాక్స్ మరియు ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ పై సమీక్ష చేశారు. బకాయిలు ఉన్న వార్డులోని ప్రజలు తక్షణమే చెల్లింపులు చేయాలని, పట్టణ అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంతో అవసరమని ఆయన వివరించారు. మున్సిపాలిటీ అందించే సేవలు మెరుగుపడాలంటే ప్రజల సహకారం చాలా ముఖ్యమని కమిషనర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, సచివాలయ సెక్రటరీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి సూరిబాబు, బలిమి ఉమా, పలిసెట్టి దాసు, బత్తుల వెంకటరమణతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పలు వార్డుల్లో లాలం రామలక్ష్మి పర్యటన

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి చెత్త పొడి చెత్త వేరు చసిమున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని విచ్చలవిడిగా మున్సిపల్ కాలువల్లో మున్సిపల్ రోడ్ల పైన చెత్తనవే రాదని పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మున్సిపల్ డీఈ కిరణ్ కుమార్ మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర గుప్తా, శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురళి, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో గొల్ల వీధి, పల్లా వీధి మరియు స్మశానం రోడ్డులో పర్యటించారు. గొల్ల వీధిలో శానిటేషన్ పరిశీలించి బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిని వెంటనే క్లియర్ చేయించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ బావులను పరిశీలించి వాటి క్లోరినేషన్ చేయించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురళి కి ఆదేశించారు. స్మశానం రోడ్లో నిర్మాణంలో ఉన్న కాలువలను పరిశీలించి మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర గుప్తాకి సూచనలు జారీ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్యస్పందన

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలం లో శ్రీ సత్యసాయి 100వ జన్మదిన సందర్భంగా జిల్లా అంత నివారణ సంస్థ మరియు నవజీవన్ సేవా సంస్థ వారి సహకారంతో మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఓపికి 105 మంది కి కంటి తనిఖీలు చేయగా 52 మంది ఐఓఎల్ క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని అష్ట చికిత్స నిమిత్తం విశాఖపట్నంలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కి పంపించడం జరుగుతుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల భాస్కర రాజు, ఎం కృష్ణమూర్తి రాజు, మెడికల్ ఆఫీసర్ అజిత్ బాబు, సి హెచ్ ఓ రామారావు, నవజీవన్ ట్రస్ట్ ప్రతినిధి సాదేం వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ ఇంచార్జి సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

లిబాక్స్ క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండ్రు

విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మంగళవారం ఉదయం 9:30 గంటలకు రాజాం టౌన్లోని సూర్యదుర్గ కళ్యాణ మండపం దగ్గర దాసరి అమర్నాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను అభివృద్ధి చేసుకుని ముందుకు రావడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, శేషపు రమేష్, మరిపి జగన్మోహన్, టంకాల కన్నంనాయుడు, గార గుణ్ణం నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ఒరేటర్ పోటీలలో సత్తా చాటిన విద్యార్థి శ్రీ శ్రావణను అభినందించిన ఎమ్మెల్యే బేబినాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : విజయనగరం జోనల్ స్థాయిలో నారాయణ విద్యాసంస్థల మాస్టర్ ఒరేటర్ పోటీలలో, జిల్లాలో రెండవ స్థానం కైవసం చేసుకున్న కోటగిరి శ్రీశ్రవణ్.. నారాయణ స్కూల్, బొబ్బిలి బ్రాంచ్ యందు 6వ తరగతి చదువుతున్న శ్రీశ్రవణ్ ను

ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం బొబ్బిలి కోటలో అభినందించారు.

చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్డు పనులకు శంఖుస్థాపన

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పథకాల అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రజలు అడగా ఉండాలని ఎమ్మెల్యే బేబి నాయన పిలుపునిచ్చారు. అందులో భాగంగానే రాష్ట్ర రహదారులు మరియు భవనముల శాఖ ఎస్.ఏ.ఎస్.సి.ఇ. నిధుల నుంచి మంజూరు చేసిన రూ4.5 కోట్ల రూపాయల నిధులు తో చిలకపాలెం నుండి రామభద్రపురం మీదుగా రాయగడ వెళ్లే రోడ్డు పనులకు సోమవారం మండల పరిధిలోని గొర్లిసీతారాంపురం గ్రామం వద్ద ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన), బుడా చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు లు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో రహదారుల విషయంలో అలసత్వం ప్రదర్శించారని, అందువలన రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు.రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా తనకు ఎంతో ఆప్తులైన కొందరు కార్యకర్తలను కూడా రోడ్డు ప్రమాదంలో కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని ఆవేదనలి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అత్యవసరమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉన్నా కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, తాము మాట ఇచ్చిన విధంగా రోడ్డు పనులకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించానని, అతిత్వరలో ఈ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శులు అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బా బాబు, జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ గిరడ అప్పలస్వామి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ వేమకోటి గిరిబాబు గారు, బీజేపీ జిల్లా కార్యదర్శి ముగడ అనిల్, గొర్లెసీతారాంపురం సర్పంచ్ గొర్లె ఈశ్వర్ ప్రసాద్, ఎంపీటీసీ గొర్లె తిరుపతిరావు పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చేందుకే రైతన్నా..మీకోసం : ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర - వంగర : మండలం, కింజంగి గ్రామంలో "రైతన్నా.. మీకోసం" కార్యక్రమంలో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు.గత అయిదేళ్ళ వైసీపీలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు స్వర్ణయుగంగా మారిందన్నారు. రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఏడు రోజులపాటు రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రైతు సేవ కేంద్రంలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్తో పాటు ఆరుగురు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రైతుల సమాచారాన్ని సేకరిస్తారు. అలాగే, 'పంచ సూత్రాల' అమలుపై రైతులకు అధికారులు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. ప్రతీ మూడు కుటుంబాలను ఒక క్లస్టర్గా విభజించి. ఒక్కొక్క బృందం రోజుకు 30 క్లస్టర్లు (90 గృహాలు) సందర్శించనున్నారని, ఈ కార్యక్రమం ముగింపులో, డిసెంబర్ మూడవ తేదీన ప్రతి రైతు సేవ కేంద్రంలో వర్క్షాప్ నిర్వహించి, ఖరీఫ్, రబీ పంటల సాగుపై రైతులకు అవసరమైన సూచనలను అధికారులు చేయనున్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ అధికారులను కూడా భాగస్వామ్యం చేసింది. ఈ అధికారులు ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేలా తగిన సూచనలు చేయను

న్నారన్నారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి మోహన రావు, కిమిడి అశోక్ కుమార్, సుమల వెంకట మన్మథరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, దూబ ధర్మారావు, బెజ్జిపురపు రవి, మజ్జి గణపతి, బలిజిరెడ్డి శ్రీను, దుప్పల పూడి శ్రీను, జయరాం తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు డిఎల్డిఓ, ఎండిఓ తదితర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుమతులు లేని చోట మాంసం దుకాణాలు
అధికారుల పనితీరుపై ప్రజల్లో ఆగ్రహం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్ కోట పట్టణంలో అనుమతులు లేని ప్రాంతాల్లో కూడా మాంసం, చేపల దుకాణాలు కొనసాగుతున్నా అడ్డుకట్ట వెయ్యకపోవడంతో అధికారుల పనితీరుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్త మవుతోంది. మాంసం మరియు చేపల విక్రయానికి స్థానిక పంచాయితీ నుండి ప్రత్యేక అను మతులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని చట్టం చెబుతున్నప్పటికీ, ఇక్కడ ఆ నిబంధనలు అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం మాంసం దుకాణాలు పాఠశాలలు, మతపరమైన ప్రదేశాలు, కూరగాయల మార్కెట్లకు నిర్దిష్ట దూరంలో ఉండాలి. బహిరంగంగా మాంసం ప్రదర్శించడం, అనారోగ్యకరంగా నిల్వచేయడం, వ్యర్థాలను సరిగా నిర్వహించకపోవడం పూర్తిగా నిషిద్ధం. అమ్మకానికి అనుమతించబడే మాంసంపై పశుసంవర్ధక శాఖ వెటర్నరీ సర్జన్ లేదా సంబంధిత ఆరోగ్య అధికారి ముద్ర తప్పనిసరి. కానీ శృంగవరపుకోటలో ఈ ప్రాథమిక నిబంధనలు ఏ ఒక్కటీ పాటించ కుండానే దుకాణాలు నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ వారు స్పష్టంగా "ఇక్కడ మాంసం దుకాణాలు పెట్టరాదు" అని బోర్డులు ఏర్పాటు చేసిన చోట్లే ఈ అక్రమ దుకాణాలు కొనసాగడం ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడపై దాతల సహకారంతో గీయించిన దేశ నాయకులు,, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు కూడా ఈ దుకాణాల కారణంగా కనిపించ కుండా పోతున్నాయని స్థానికులు మండి పడుతున్నారు. వ్యాపారులు తమకు లైసెన్సులు ఉన్నాయని, సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో దుకాణాలు నడుపుతున్నామని, పంచాయితీ ఆశీలు కూడా చెల్లిస్తున్నామని బహిరంగంగానే చెబుతున్నారు.ఆ డబ్బు అసలు ఎవరి చేతుల్లోకి వెళ్తుందన్న ప్రశ్నను ప్రజలు లేవనెత్తుతున్నారు. అక్రమ మాంసం వ్యాపారాన్ని నియంత్రించాల్సిన పంచాయితీ, ఆహార భద్రతా శాఖ, ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పరిశు భ్రతా నియమాలు, చట్టపరమైన నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడుతున్న నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకొని అక్రమ దుకాణాలను తొలగించాలని, పారదర్శక విధానం అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం లాంటివని డిస్ట్రిక్ట్ అర్బన్ సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ (డియుఎస్ఇఎ)అధ్యక్షుడు బూసాల శ్రీను అన్నారు. అందుకే పత్రికలను ఫోర్త్ ఎస్టేట్ గా చెబుతారని ఆయన తెలిపారు. విజయనగరం జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగాల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి వేదుల సత్యనారాయణను మంగళ వారం సాయంత్రం నగరంలో ఎన్జీవో హోంలో అభినందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు బహుముఖ పాత్ర పోషిస్తాయని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అనేక సమస్యలను, రుగ్మతలను వెలుగులోకి తెచ్చి పాత్రికేయులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నారని చెప్పారు.అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం కమలాకర్,సిహెచ్ రమాదేవి, సహాయ కార్యదర్శి దాశరథి మాట్లాడుతూ పాత్రికేయులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పేదల కష్టాలను, ప్రజల సమస్యలను, నిరుద్యోగుల వెతలను, అధికారుల అవినీతిని ఎండగడుతూ ప్రభుత్వం ముందు ఉంచుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ఆరోపణలు మానుకోవాలి
జిల్లా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం పోర్ట్ : వైసిపి నాయకులు భోగాపురం విమానాశ్రయం విషయంలో చేస్తున్న అసత్య, అసంబద్ధ ఆరోపణలను మాను కోవాలని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ 2014 లోనే భోగాపురానికి విమానాశ్రయం రావాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అప్పటినుండి నేటి వరకు విమానాశ్రయ విషయంలో తెలుగుదేశం పార్టీ నిరంతర కృషి ఎంతో ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భోగాపురం విమానాశ్రయానికి చేసిందేమీ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా భోగాపురానికి ఎయిర్పోర్ట్ అవసరం లేదని చెప్పిన విషయం తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా రైతులు తెలుగుదేశం పార్టీ హయాంలోనే లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

పుణ్యగిరి కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పుణ్యగిరి కాలనీలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో కాలనీ వాసులు మంగళవారం,ఎస్ కోట పోలీస్ స్టేషన్ను ఆశ్రయించి పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. కాలనీవాసుల వివరాల ప్రకారం, అర్ధరాత్రి సమయాల్లో కొంతమంది యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ ఇళ్ల తలుపులు కొట్టడం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు బైక్లపై వచ్చి బండిరేసులు చేస్తూ కాలనీ లోపల తిరగడం వల్ల ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొన్నట్లు వారు వాపోయారు. కాలనీలో నివసిస్తున్న రమణమ్మ ఇంటి తలుపులు కూడా కొట్టి ఆమెను భయభ్రాంతులకు గురిచేశారని వారు పేర్కొన్నారు. ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతుండటంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు భయంతో ఇంట్లోనే వణుకుతూ ఉన్నట్టు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు భద్రత కల్పించేందుకు రాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల వరకు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలి అని కాలనీవాసులు తమ వినతిపత్రంలో పోలీసులను కోరారు.

రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే కోండ్రు భూమి పూజ

విశాలాంధ్ర - రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో పలు రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ మంగళవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ముఖ్యమైన రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. క్రమంగా పాలకొండ విజయనగరం ప్రధాన రహదారి నుంచి కొత్తవలస జంక్షన్ వరకు నబార్డ్ నిధులతో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామంలో మున్సి పాలిటీ నిధులతో రూ.12.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మించడం కోసం కూడా భూమిపూజ నిర్వ హించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ, "రాజాం నియోజకవర్గం అన్ని రంగా లలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రత్యేకంగా రహదారుల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నాం. గత ఏడాదిన్నరలో ఎన్నో రహదారులకు భూమిపూజలు, ప్రారంభోత్సవాలు జరగడం అభివృద్ధికి నిదర్శనం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గురువాన నారాయణరావు, సిమ్మ జగన్నాథం, మరిపి జగన్మోహన్ స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఏఈ వెంకటరామరాజ్, ఆర్ అండ్ బి ఏఈ నాగభూషణం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనంలో మెట్టపల్లి విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి మండలం మెట్టపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యా ర్థులు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించారు. ఒంగోలు (ప్రకాశం జిల్లా) సృష్టి ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్ యూత్ డ్రాయింగ్ పోటీలలో విద్యార్థులు ఉత్తమ నైపుణ్యం కనపరిచారని హెచ్.ఎం విజయకుమార్ మంగళ వారం తెలిపారు. ఈ మేరకు రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మెట్టపల్లి లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అనంతరం ప్రధానో పాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టి కి తీసుకురాగా అయన విద్యార్థుల ను బంగార పథకాలు రావడం సంతోషంగా ఉందని అభినందించారు. 21మంది పాల్గొని బంగారు పథకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్ కుమార్ ను అభినందించారు.విద్యార్థులకు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మద్యం సేవించి ఆటో నడిపిన ఆటో డ్రైవర్కి మూడు రోజులు జైలు శిక్ష

విశాలాంధ్ర - బొబ్బిలి : వాహనదారులు పోలీస్ ట్రాఫిక్ నిబంధనలో పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ సిబ్బందికి సహకరించాలని మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని పట్టణ సీఐ సతీష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్.ఐ. వి.జ్ఞాన ప్రసాద్ నిర్వహించిన వెహికల్ చెకింగ్ లో మద్యం సేవించి ఆటోను నడుపుతున్న. పట్టణం తారకరామా కాలనీకి చెందిన అద్దంకి శంకర్రావు. మద్యం సేవించి ఆటో నడుపుతుండగా అదుపులోకి తీసుకొని గౌరవ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, బొబ్బిలి వారి ఎదుట హాజరు పరచగా సదరు నిందితునికి మూడు రోజులపాటు జైలు శిక్ష విధించి డిమాండ్ కు. తరలించినట్లు పట్టణ సీఐ సతీష్ కుమార్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన మరో నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున కోర్టు వారిచే జరిమానా విధించినట్లు తెలిపారు. బొబ్బిలి పట్టణ, మండల ప్రజలకు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, జైలు శిక్ష కూడా విధింపబడతాయని బొబ్బిలి పట్టణ సి కె సతీష్ కుమార్ తెలియజేశారు.

హోటల్ జేసీ గ్రాండ్ను ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీమోహన్

విశాలాంధ్ర - రాజాం : రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మంగళ వారం ఉదయం పాలకొండ రోడ్డు జేఎల్కే టైల్స్ పక్కన నూతనంగా నిర్మించిన హెటల్ జెసి గ్రాండ్ను ఘనంగా ప్రారంభించారు. పట్టణంలో అతిథి సేవల విస్తరణ, వ్యాపార అభివృద్ధికి ఇలాంటి హెటల్స్ తోడ్పడతాయని ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెటల్ ప్రొప్రైటర్ దుప్పాడ విజయరావు, దుప్పాడ వినోద్రావు, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గురవాన నారాయణరావు, యందవ నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, శేషపు రమేష్, మరిపి జగన్మోహన్, మిత్తిరెడ్డి మధుసూదనరావు, టంకాల కన్నం నాయుడు, గుణ్ణం నాయుడు, టిడిపి నాయకులు, పార్టీ కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టెట్ పరీక్ష పై పార్లమెంటులో చర్చించాలి
యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కే.విజయ్ గౌరి డిమాండ్

విశాలాంధ్ర - బొబ్బిలి : విద్యారంగ, ఉపా ధ్యాయులు సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర నాయకులు విజయగౌరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్లు అన్నారు. టెట్ పరీక్షపై ఇప్పటికే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేస్తామని చెప్పి ఇంతవరకు వేయలేదని, ఇప్పటికైనా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దశలవారీ పోరాటం విద్యారంగ సమస్యలపై డివిజన్ కేంద్రాల్లో డిసెంబర్ 9,10 తేదీలలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. డిసెంబర్ 18 జిల్లా కేంద్రంలో జనవరి మొదటివారంలో రాష్ట్ర స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. జనవరి 29 న ఎన్ఈపి రద్దు చేయాలని, టెట్ పరీక్షను విరమించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఛలో ఢిల్లీ కార్య క్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలియచేసారు. ఈ దశలవారీ పోరాట కార్యక్రమం లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రమేష్, సత్య న్నారాయణ, సుధాకర్, శంకరరావు, చిట్టిబాబు, చంటి, త్రినాధ్, అనంతరావు, శ్రీనివాస్, అప్పలనాయుడు, రామారావు, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి, జీడి మామిడి రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - మెంటాడ : ఉద్దంగి గ్రామంలో మెంటాడ మండలానికి చెందిన మామిడి, జీడి మామిడి పంటల రైతులకు సమగ్ర సస్యరక్షణ చర్యలు, కోత కోత అనంతర యాజ మాన్య పద్ధతులపై మంగళవారం శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గజపతినగరం ఉద్యాన అధికారి బి. దీప్తి నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న డా.శ్రీనివాస్ రాజు, శాస్త్రవేత్త, కె.వి.కె. రాస్తంగుంటబయి, పార్వతీపురం మన్యం పండ్ల దశలో పంటలకు పురుగులు, తెగుళ్ల వచ్చే ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. అదే విధంగా పూత మరియు కాయ సీజన్లో పిచికారీ చేయాల్సిన మందుల గురించి, మామిడి ఫ్రూట్ కవర్స్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. తదుపరి కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.చిట్టిబాబు పాల్గొని ఆయిల్ పామ్ సాగు, రైతులకు చేకూరే ప్రయోజ నాలు, ఉత్పత్తి మద్దతు ధర అవకాశాలు, అంతేకాకుండా ఉద్యాన శాఖ ద్వారా అమలు అవు తున్న వివిధ రకాల రాయితీ పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు. అనంతరం అధి కారులు రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో మామిడి తోటను సందర్శించి, ప్రస్తుతం వచ్చే పూత కాయ దశలో చేయాల్సిన శాస్త్రీయ చర్యలను పని తీరు ఆధారంగా ప్రత్యక్ష ప్రదర్శన రూపంలో వివరించారు. కార్యక్రమంలో 50 మందికి పైగా రైతులు పాల్గొని, తమ పంటలకు సంబంధించిన సమస్యలు, సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. గ్రామ సర్పంచ్ తాటి తిరుపతి, పెద్దలు గౌరీ శంకర్ సత్యనారాయణ వి.ఎచ్.ఎ ధనుంజయ్, స్థానిక రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మహిళల రక్షణ - సమాజ అభ్యున్నతి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినంగా ఆవిష్కరించబడుతుంది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ కృష్ణ ప్రసాద్ మహిళా ప్రాంగణంలోని శిక్షణ పొందుతున్న మహిళ లకు న్యాయ అవగాహన సదస్సు నిమిత్తం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల భద్రత గౌరవం హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి వర్గం ఏకమై ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. మహిళలపై హింస - శారీరక మానసిక ఆర్థిక లైంగిక వేధింపులు గృహింస బాల్యవివాహాలు ఆన్లైన్ వేధింపులు వంటి వివిధ రూపాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, సమాజ అభివృద్ధి పై గాడమైన ప్రభావం చూపే సామాజిక సమస్య అని తెలియజేశారు. ఈ నేపథ్యంలో మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు చట్టపరమైన చర్యలను మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అవగాహన పెంపు బాలికల విద్య, పురుషులలో మనస్తత్వ మార్పు, కుటుంబ స్థాయిలో లింగ సమానత్వం - ఇవి హింస నిర్మూలనకు ప్రధాన ఆధారాలు. మహిళల భద్రత కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని హింసను చూసిన విన్న అప్రమత్తంగా స్పందించాలని బాధితులకు న్యాయం దక్కేలా సహకరించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళలపై హింస లేని సమాజ నిర్మాణమే మన బలం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'రైతన్న - మీ కోసం' వారోత్సవాలలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



విశాలాంధ్ర - డెంకాడ : మండల కేంద్రంలోని పెదతాడివాడ పంచా యతీలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రైతన్న - మీ కోసం వారోత్సవాలలో నెల్లిమర్ల శాసన సభ్యురాలు లోకం నాగ మాధవి హాజరయ్యారు ఈ సందర్భంగా వారోత్సవాలలో భాగంగా, ఎమ్మెల్యే గారు రైతులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత రైతే దేశానికి వెన్నెముక అని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. సాంకేతికత వినియోగంఆధునిక వ్యవసాయ పద్ధతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడిని సాధించి, లాభాలు పొందాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పథకాల సద్వినియోగం: రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల బీమా, విత్తనాలు, ఎరువుల పంపిణీపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

రైతు సేవ ఉద్యమంలా కొనసాగించాలి : ఈ వారోత్సవాలు కేవలం ప్రదర్శనలు కాకుండా, రైతులకు నిరంతరంగా సేవలు అందించే ఉద్యమంలా కొనసాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులకు ఆదేశం రైతులకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రైతు సేవా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ వ్యవసాయాధికారి నిర్మల పైల శంకర్రావు పాల శ్రీను కోరాడ వెంకటరమణ తుమ్మిలక్ష్మి వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి విశాఖ మేయర్ శంకుస్థాపన..
రెండు జిల్లాల ప్రజలు హర్షం

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని, కృష్ణారాయుడుపేట గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి మంగళవారం విశాఖ జీవీఎంసీ మేయర్ పిలా శ్రీనివాసరావు చేతుల మీదుగా శంకు స్థాపన జరపడంతో ఈ ప్రాంతీయులంతా హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి - విజయనగరం జిల్లాలకు సరిహద్దులో రైవాడ ఓపెన్ కాలువపై శిథిలా వస్థకు చేరిన వంతెన మీదుగా గత ఆరు నెలల నుండి వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ఈ ప్రాంత ప్రజలంతా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ కృషి ఫలితంగా వంతెన నిర్మాణానికి రూ.91లక్షలు నిధులు మంజూరయ్యాయి.ఆమేరకు విశాఖ మేయర్ శంకు స్థాపన జరపడంతో నెలరోజుల్లోగా వంతెన నిర్మాణం పూర్తి చేస్తారని తద్వారా వాహనాల రాక పోకలు పునరుద్ధరణ జరుగుతుందన్న ఆనందాన్ని రెండు జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 25 మంది నిందితులకు జరిమానా, ఇద్దరికి జైలుశిక్ష
జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయనగరం రూరల్ , ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మంది నిందితులకు రూ.10,000 లు చొప్పున జరిమానా, ఇద్దరు నిందితులకి 5 రోజులు జైలుశిక్ష విధిస్తూ విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి, విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ కోర్ట్) శ్రీవిద్య తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ. ఆర్. దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం సేవించి, వాహనాలు నడిపిన 18 మంది వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 18 మందిని విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి

వద్ద హాజరుపర్చగా 17 మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10,000 లు చొప్పున జరిమానా, ఒక నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు. అదే విదంగా విజయనగరం రూరల్ స్టేషన్ పరిధిల్లో రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం సేవించి, వాహనాలు నడిపిన 9 మంది వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 9 మందిని విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ కోర్ట్) శ్రీవిద్యవద్ద హాజరుపర్చగా 8 మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10,000 లు చొప్పున జరిమానా, ఒక నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.